క్లుప్తంగా

ఉరవకొండ లయన్స్ క్లబ్‌కు ఉత్తమ సేవా పురస్కారం



ఉత్తమ సేవా పురస్కారాన్ని పొందిన ఉరవకొండ లయన్స్ క్లబ్ సభ్యులు

ఉరవకొండ: ఉరవకొండ లయన్స్ క్లబ్‌కు ఉత్తమ సేవా పురసస్కారం దక్కింది. నెల్లూరులో జరుగుతున్న లయన్స్ క్లబ్ 7టీ అన్యువల్ డిస్ట్రిక్ కన్వెన్షన్ సమావేశంలో ఆదివారం ఉరవకొండ లయన్స్ క్లబ్ సేవలకు గుర్తింపు లభించింది. క్లబ్‌కు ఉత్త మ సేవా పురస్కారం అవార్డు దక్కింది. లయన్స్ క్లబ్ గవర్నర్ చేతుల మీదుగా ఉరవకొండ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎంసీ జయకృష్ణ, కార్యదర్శి నగేష్‌బాబు, సీనియ ర్ సభ్యులు చిట్టా శ్రీధర్, ప్రభాకర్ నాయుడు, సత్య నారాయణ, గణేష్ బాబు, నాగేశ్వరావు, కొమ్మసాని బాలచంద్ర పురస్కారాన్ని పొందారు.

మే 4న ఉచిత సున్తీ కార్యక్రమం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని అజ్మతుల్ ఇస్లాం కమిటీ ఆధ్వర్యంలో మే 4న పేద ముస్లిం బాలురకు ఉచిత సున్తీ (ఖత్నా) కార్యక్రమం ఉంటుందని అంజుమన్ కమిటీ అధ్యక్షుడు బ్రెడ్ సర్మాస్ తెలిపారు. ఆదివారం స్థానిక అంజుమన్ కాంప్లెక్స్‌లో జరిగి కమిటీ సమావేశంలో సభ్యులు తీర్మానించినట్లు తెలిపారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

ఉరవకొండ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు ఆదివారం ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని పర్యవేక్షణ అధికారి విజయభాస్కర్, మండల విద్యాశాఖ అధికారి ఈశ్వరప్ప, గురుకులం ప్రిన్సిపాల్ జ్ఞాన ప్రసూన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 5వ తరగతి ప్రవేశ పరీక్షలకు 554 మంది దరఖాస్తు చేసుకోగా, 488 మంది హజరయ్యారని, 66 మంది పరీక్షలకు గైరుహజరయ్యారన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశ పరీక్షలకు 388 మంది దరఖాస్తు చేసుకోగా, 332 మంది హాజరయయ్యారని, 56 మంది గైర్హాజరయయ్యారు.

ఘనంగా పార్వేట ఉత్సవం




ఆదిదంపతులకు పూజలు చేస్తున్న అర్చకుడు

కూడేరు: కూడేరు పార్వతీపరమేశ్వర స్వయంభు జోడు లింగాల సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం పార్వేట మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆదిదంపతులకు ఆలయ పురోహితులు క్షీరాభిషేకం, రుద్రాభిషేకం పూజలు చేశారు. సాయంత్రం కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో అశ్వ వాహనంపై పార్వతీపరమేశ్వర ఉత్సవ విగ్రహాలను కొలువదీర్చి ఊరు నుంచి సంగమేశ్వర స్వామి ఆలయానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. పెద్ద ఎత్తున భక్తజనం తరలి వచ్చి పార్వేట మహోత్సంలో పాల్గొన్నారు. సీఐ రాజు తన సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈఓ రమేష్ బాబు, కుమ్మరి కులస్తులు, ఆలయ జీర్ణోద్దరణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంగమేశ్వాలయం వద్ద సందడి

స్థానిక సంగమేశ్వరస్వామి ఆలయం వద్ద పెద్ద ఎత్తున దుకాణాలు వెలిశాయి. పిల్లలకు వినోదం పంచడానికి రంగుల రాట్నాలు, తినుబండారాల దుకాణాలు, గాజులు, బొమ్మల దుకాణాలు వెలిశాయి. ఆదివారం పార్వేట కావడంతో పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

రైతులను ఆదుకోవాలి



ముద్దలాపురంలో మొక్క జొన్న పంటను పరిశీలిస్తున్న దృశ్యం

కూడేరు: నియోజకవర్గ వ్యాప్తంగా ఈదురుగాలులు, వడగండ్ల వానకు అరటి, మొక్కజొన్న, బొప్పాయి, కర్బూజ పంటలు దెబ్బతిని రూ. కోటి వరకు పంట నష్ట పోయినట్లు వైఎస్సార్ సీపీ రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు మేకల సిద్ధార్థ తెలిపారు. ఆదివారం ఆయన కూడేరు మండల రైతు సంఘ అధ్యక్షుడు జల్లిపల్లి సిద్దారెడ్డితో కలిసి ముద్దలాపురం, ఉరవకొండ, బెలుగుప్ప మండలాల్లోని పలు గ్రామాల్లో పర్యటించారు. రెండు రోజులుగా గాలీవానకు దెబ్బతిన్న మొక్కజొన్న, బొప్పాయి, బ్యాడిగి మిర్చి, ఇతర పంటలు పరిశీలించారు. అనంతరం మేకల సిద్ధార్థ, సిద్దారెడ్డి మాట్లాడారు. 1000 ఎకరాల్లో మొక్కజొన్న, 200 ఎకరాల్లో బొప్పాయి, 400 ఎకరాల్లో బ్యాడిగి మిర్చి, 300 ఎకరాల్లో అరటి, పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ముద్దలాపురం సర్పంచ్ ధనుంజయ్య, రైతులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

వజ్రకరూరు:జరుట్లరాంపురం,తట్రకల్లు గ్రామా ల్లో వర్షంతో దెబ్బతిన్న పంటలను అధికారులు ఆదివారం పరిశీలించారు. జరుట్ల రాంపురం రైతు గోవిందు నాలుగు ఎకరాల్లో సాగు చేసిన కర్బూజ పంట అకాల వర్షానికి దెబ్బతినింది. తట్రకల్లుకు చెందిన రైతు మూగెన్న సాగు చేసిన అరటి పంట దెబ్బతినింది.ఉద్యాన అధికారి నెట్టికంటయ్య, హార్టికల్చర్ అసిస్టెంట్లు డాకునాయక్, కృపా పంటలు పరిశీలించారు.

సామాన్యులపై గుదిబండ



గ్యాస్ బండ... సామాన్య కుటుంబాలకు గుదిబండగా మారుతోంది. పెట్రోల్, డీజిల్ తరహాలోనే గ్యాస్ ధర పెరుగుతూనే ఉంది. ఇటీవల ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై రూ.50 అదనంగా పెంచింది. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా గతేడాది దీపావళి పండుగ పురస్కరించుకుని అమల్లోకి తెచ్చిన ఉచిత గ్యాస్ అంతా బోగస్‌గా మారింది. వేలాది మంది ఎల్‌పీజీ దారులు ఈ పథకానికి నేటికీ దూరంగా ఉంటున్నారు. సరైన అవగాహన లేక ప్రభుత్వం ఇచ్చే ఉచిత సిలిండర్ రాయితీని అందుకోలేకపోతున్నారు.

- సిలిండర్‌పై అదనంగా రూ.50 వడ్డింపు
- ఉచిత గ్యాస్ అంతా బోగస్
- రాయితీ కోసం ఎదురుచూస్తున్న ఎల్‌పీజీ దారులు

రాయదుర్గం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్యాస్ వడ్డింపు మొదలుపెట్టింది. ప్రస్తుతం 14.2 కిలోల వంటింటి గ్యాస్ రూ.872 ఉండేది. తాజాగా రూ.50 పెంచిన ధరలు మంగళవారం నుంచి అమల్లోకి రావడంతో రూ.922 చెల్లించాల్సి వస్తోంది. దీనికి డెలివరీ చార్జీలు వసూళ్లు చేస్తుండడంతో రూ.950 పేదలు చెల్లించుకోవాల్సి వస్తోంది. రాయదుర్గం, కళ్యాణదుర్గం డివిజన్‌లో 12 వివిధ గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. వీటి పరిధిలోని దీపం 89,084, పీఎంయూవై 7,070, సీఎస్ఆర్ 15,015, జనరల్ 69,128, కమర్షియల్ 1,249 మొత్తం 1,81,528 ఎల్‌పీజీ కనెక్షన్లు ఉన్నాయి. ఈ లెక్కన వినియోగదారులపై ప్రతి నెల రూ.90.76 లక్షలు అధనంగా బారం పడుతోంది. దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

వంటగ్యాస్ ధరలు పెంచబోమన్నారు?

ఎన్నికల హామీల్లో బాగంగా వంట గ్యాస్ ధరలు ఎట్టి పరిస్థితుల్లో పెంచబోమని కూటమి సర్కార్ ఊరు, వాడ ప్రజలందరికీ హామీ ఇచ్చింది. గతంలో ఇచ్చే దానికంటే మరింత తగ్గించి ఇచ్చే బాధ్యత తీసుకుంటామని సీఎం చంద్రబాబు హామీఇచ్చారు. తీరాచూస్తే పట్టుమని పదినెలల పాలనకే రూ.50 అదనంగా వడ్డింపు కార్యక్రమం మొదలైంది. దీంతో సామాన్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు అర్హత కలిగిన వారందరికీ ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ పథకం ఆదిలోనే అటకెక్కింది. చాలా మంది సద్వినియోగం చేసుకోలేని పరిస్థితి కనిపిస్తోంది. రిజిస్ట్రేషన్ చేసుకోవడంలో గ్యాస్ ఏజెన్సీలు నిర్లక్ష్యం చూపుతున్నారు. దీంతో పేదలకు ఆ పథకం అందని ద్రాక్షలా ఊరిస్తూనే ఉంది. ఇంతలోనే ఈ అదనపు వడ్డింపు మరింత కలవరపాటుకు గురి చేస్తోంది.

పెంచిన ధరలు తగ్గించాలి



వంట గ్యాస్ ధరలు తరచూ పెంచుకుంటుపోతే పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఇబ్బంది తప్పదు. చిరుద్యోగి నెల జీతంకు సరిపడేలా లెక్కలు కట్టుకుని జీవనం సాగిస్తుంటాడు. ఇలా నిత్యావసర సరుకులతో పాటు గ్యాస్ ధరలు అమాంతంగా పెరిగిపోతుండడంతో అదనపు భారం మోయలేక అవస్థలు పడాల్సి వస్తోంది. ఒకేసారి రూ.50 భారం మోపడం సరైంది కాదు.

– లీలావతి, గృహిణి, బీటీపీ

ధరలు ఉపసంహరించుకోవాలి



పెంచిన వంట గ్యాస్ ధరను తక్షణం ఉపసంహరించుకోవాలి. పేదల పై పెను భారం మోపే విధానం ప్రభుత్వాలు మానుకోవాలి. ఉచిత గ్యాస్ పథకం సక్రమంగా అలమలు చేసేలా చర్యలు చేపట్టాలి. గ్యాస్ ధరలు తగ్గించకపోతే ఆందోళన బాట పడుతాం.

– నాగార్జున, సీపీఐ, తాలూకా కార్యదర్శి, రాయదుర్గం

అన్నదాతలను తక్షణమే ఆదుకోండి

- అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించిన మెట్టు



యర్రగుంటలో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న మెట్టు గోవిందరెడ్డి

కణేకల్లు/బొమ్మనహాళ్: అకాల వర్షానికి పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి డిమాండ్ చేశారు. కణేకల్లు మండలంలోని యర్రగుంట, గెనిగెర, కణేకల్లు క్రాస్, బొమ్మనహాళ్ మండలంలోని గోనేహాళ్, శ్రీధరఘట్ట, సింగేపల్లి గ్రామాల్లో ఆదివారం మెట్టు పర్యటించారు. అకాల వర్షానికి దెబ్బతిన్న మొక్కజొన్న, వరి, పత్తి పంటలను పరిశీలించారు. ఈదురుగాలు, వడగండ్లన వానకు మొక్కజొన్న, వరి, పత్తి పంటలు నష్టపోయామని యర్రగుంటకు చెందిన రైతులు వన్నూరుసాబ్, ఎర్రిస్వామి, సర్మాస్‌వలీ, శివన్న, అంజనేయులు గెనిగెరకు చెందిన రైతులు నరసింహారెడ్డి, చంద్రశేఖర్, వన్నారెడ్డి, ఎర్రిస్వామి, మంజునాథరెడ్డి, వీరేష్, శంకర్‌రెడ్డి మెట్టు దృష్టికి తెచ్చారు.

కాలవా.. నీ సమర్థత నిరూపించుకో..

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు గొప్పలు చెప్పుకోవడమే కాదు.. నియోజకవర్గంలో అకాల వర్షంతో పంటలు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం నుంచి సాయం అందించేలా చేసి సమర్థతను నిరూపించుకోవాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి సూచించారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. అకాల వర్షంతో సర్వం కోల్పోయిన రైతులు ప్రభుత్వ సాయం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే కాలవ రైతులకు పరిహారం అందించేలా చొరవచూపాలన్నారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పార్టీలు,మతాలు, కులాలు చూడకుండా పంట దెబ్బతిన్న ప్రతి రైతుకూ సాయం అందించారని మెట్టు గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం కూడా పార్టీలకతీతంగా ప్రతి రైతుకు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ కూడా పంట నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. బాధిత రైతులకు అన్యాయం చేస్తే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు మారెంపల్లి మారెన్న, కోశాధికారి పాటిల్ నాగిరెడ్డి, కార్యదర్శి పాటిల్ చెన్నకేశవరెడ్డి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి, వైస్ కన్వీనర్ వేమన, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ యంద్రకాయల వన్నూరప్ప, మాజీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, ఎంపీటీసీ జయరాం, రాయదుర్గం తాలుకా వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు డి.శ్రీనివాసులు, కోశాధికారి ఆదిసద్గురు చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు హళ్లి నాగరాజు, కెంగుట రామిరెడ్డి, బోయ రమేష్, కేజీ ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



రామ్మోహన్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు , ఇన్‌సెట్‌లో రామ్మోహన్

ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, విశ్రాంత ఎక్సైజ్ సీఐ ముద్దాలపురం రామ్మోహన్ (60) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి మృతుడి కుటుంబాన్ని ఫోన్‌లో పరామర్శించి, రామ్మోహన్ మృతికి సంతాపం తెలియజేశారు. విశ్వ మాట్లాడుతూ వైఎస్సాఆర్‌సీపీలో సీనియర్ నాయకుడిగా రామ్మోహన్ ఎన్నో సేవలు అందించారన్నారు. గతంలో ప్రతి పక్షనేత హోదాలో ఉన్న సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉరవకొండ పర్యటనకు వచ్చిన సమయంలో రెండు రోజుల పాటు రామ్మోహన్ ఇంట్లోనే ఉంటూ విశ్రాంత తీసుకున్నారని గుర్తు చేశారు. అయ్యప్పస్వామి ఆలయం వద్ద ఉన్న రామ్మోహన్ ఇంటికి వైఎస్సార్‌సీపీ నాయకులు వెళ్లి మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఎంపీపీ నరసింహులు, వైస్ ఎంపీపీ ఈడిగ ప్రసాద్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, ఎస్సీ విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి, మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రిస్వామి, పార్టీ ఉద్యోగ, పెన్షనర్ల సంఘం సమన్వయకర్త సింగాడి తిప్పయ్య, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు బసవరాజు, పార్టీ రూరల్, మండల సమన్వయకర్తలు ఎర్రిస్వామిరెడ్డి, మూలగిరిపల్లి ఓబన్న, పార్టీ నాయకులు వేమన్న, చిన్న భీమ పాల్గొన్నారు.

ఈదురుగాలులతో దెబ్బతిన్న పంటలు



ఈదురుగాలులకు నేలవాలిన మొక్కజొన్న పంటను చూపుతున్న రైతు

బెళుగుప్ప: ఆవులెన్న, నక్కలపల్లి తదితర గ్రామాల మధ్య ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వాన కురిసింది. ఎండ వేడిమి ఉక్కపోత నుంచి వడగండ్ల వాన ప్రజలకు ఉపశమనం కలిగించినా, రైతులు సాగు చేసిన రబీ పంటలైన మొక్కజొన్న, అరటి తదితర పంటలు రైతాంగానికి తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. మొక్కజొన్న పంట ఈదురుగాలతో నేలవాలాయి. మండలంలోని గ్రామాల్లో సుమారు 800 ఎకరాలకు పైగా మొక్కజొన్నతో పాటు అరటి, బొప్పాయి, వేరుశనగ తదితర పంటలు సాగు చేసిన రైతాంగం తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వమే ఆదుకోవాలని రైతన్నలు కోరుతున్నారు.

సంక్షిప్త సమాచారం

విశ్వకు పీఏసీలో చోటు కల్పించడంపై హర్షం

వజ్రకరూరు: మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డికి వైఎస్సార్ సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీలో చోటు కల్పించడంపై వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ మండల నాయకుడు వడిత్యా గోవిందు నాయక్ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం వజ్రకరూరులో ఆయన మాట్లాడుతూ విశ్వేశ్వరరెడ్డి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. విశ్వేశ్వరరెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతమవుతుందన్నారు. ఈసందర్భంగా వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

నాటు సారా తయారీ స్థావరాలపై దాడులు

బెళుగుప్ప: మండలంలోని రమనేపల్లి సమీపంలోని వేదవతి నది పరిసరాల్లోని నాటు సారా స్థావరాలపై కళ్యాణదుర్గం ఎక్సైజ్ అధికారులు ఆదివారం దాడులు చేశారు. బోయ హనుమంతరాయుడుకు చెందిన 135 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ హసీనాబాను, ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ పీరూ నాయక్, నరసరాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి కనిపించలేదని ఫిర్యాదు

బెళుగుప్ప: మండలంలోని దుద్దేకుంటకు చెందిన ప్రభాకర్ (60) మూడు రోజులుగా కనిపించలేదని అతని కుమారుడు లోకేష్ ఆదివారం ఫిర్యాదు చేసినట్లు స్టేషన్ ఇన్‌చార్జ్, హెడ్‌కానిస్టేబుల్ బాల నరసింహులు తెలిపారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

వజ్రకరూరు: మండల కేంద్రంలోని జనార్ధన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 14 నుంచి 19 వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నట్లు ఆలయ ఈఓ అంగడాల కృష్ణయ్య తెలిపారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఈనెల 14న ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు ఉంటాయి. 15న నిత్య అర్చనలు, హంస వాహనం , 16న నిత్య అర్చనలు, హనుమద్‌వాహనం, 17న పల్లకీసేవ, స్వామివారి కల్యాణోత్సవం ఉంటాయని ఈఓ అంగడాల కృష్ణయ్య తెలిపారు. 18న పల్లకీసేవ, రథ హోమం,రథ ప్రతిష్ట, పూర్ణాహుతి హోమం, మడుగుతేరు, సాయంత్రం బ్రహ్మ రథోత్సవం జరుగుతుందన్నారు. 19న పల్లకీసేవ, వసంతోత్సవం ఉంటుందన్నారు.

అపూర్వ సమ్మేళనం



పూర్వ విద్యార్థులు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని 1993–96 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ కలయిక పేరుతో కళాశాలలో సమావేశం ఏర్పాటు చేశారు. కళాశాలలో నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ జయరామిరెడ్డి, అధ్యాపకులు సురేష్, పూర్వపు విద్యార్థులు పాతిరెడ్డి, కంబాల తిమ్మారెడ్డి, కరణం తిప్పేస్వామి, రాజేంద్ర, పెన్నప్ప, సత్యనారాయణ, గంగాధర్, రహమత్ పాల్గొన్నారు.

వైభవంగా సంగమేశ్వర స్వామి రథోత్సవం



అశేష భక్తుల నడుమ సంగమేశ్వరస్వామి రథాన్ని లాగుతున్న దృశ్యం

బొమ్మనహాళ్: మండలంలోని శింగానహళ్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం సంగమేశ్వరస్వామి రథోత్సవం కనులపండువగా జరిగింది. రథోత్సవానికి ఆంధ్ర, కర్ణాటక రాష్టాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఉదయం సంగమేశ్వరస్వామిని అలంకరించి, అభిషేకాలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి సంగమేశ్వర స్వామి రథం లాగి ప్రారంభించారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సంగమేశ్వరస్వామి రథోత్సవంలో పాల్గొన్నారు. మండల కన్వీనర్ రామాంజనేయులు, సర్పంచ్ కృష్ణ, వైస్ ఎంపీపీ రమేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు లోకేష్, ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, నాగిరెడ్డి, సింగేపల్లి శివసాయిబాబ, ఆంజనేయులు, దేవన్న, తిప్పేస్వామి, శ్రీకాంత్‌రెడ్డి, వన్నూరుస్వామి, ఆంజనేయులు, వెంకటేశులు, ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

మార్మోగిన శివనామ స్మరణ

కణేకల్లు: చిక్కణ్ణేశ్వర స్వామి రథోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కణేకల్లు కిటకిటలాడింది. వేలాది మంది భక్తుల నడుమ రథోత్సవం సాగింది. స్థానికులతోపాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన జనంతో కణేకల్లు కిక్కిరిసింది. రథోత్సవానికి రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు కర్ణాటకలోని బెంగళూరు, బళ్లారి చెలికేర, మొలకాల్మూరు, చిత్రదుర్గం, రాంపుర తదితర ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. సాయంకాలం 5 గంటల నుంచి 6.30 గంటల వరకు రథోత్సవం కొనసాగింది. ఆలయ కమిటీ ధర్మకర్త జే.ప్రసాద్‌రెడ్డి, నిర్వాహకులు, భక్తులు పూలతో రథాన్ని అలంకరణ చేయించారు. కణేకల్లు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచు నిర్మల, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రసాద్ చిత్రదుర్గం నుంచి ప్రత్యేకంగా తయారు చేయించిన భారీ గజలమాలను రథానికి వేసి అలంకరించారు. రాయదుర్గం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ గౌని ఉపేంద్రరెడ్డి, జెడ్పీ సభ్యురాలు డి.పద్మావతి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు మారెంపల్లి మారెన్న, కోశాధికారి పాటిల్ నాగిరెడ్డి, కార్యదర్శి పాటిల్ చెన్నకేశవరెడ్డిలు మడుగుతేరు ఉత్సవంలో పాల్గొని రథాన్ని లాగారు. చిక్కణ్ణేశ్వరస్వామి ఆలయం నుంచి ఈరనాగమ్మ కట్ట వరకు రథోత్సవం సాగింది. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు రథోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, ఎస్ఐ నాగమధు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పి.బ్రహ్మానందరెడ్డి, వైస్ కన్వీనర్ వేమన, రాయదుర్గం నియోజకవర్గం వాణిజ్య విభాగం అధ్యక్షులు ఆర్కే బద్రీ, ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు డి.శ్రీనివాసులు, కోశాధికారి ఆదిసద్గురు చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు హళ్లి నాగరాజు, డాక్టర్ సోమన్న, ఆలూరు చిక్కణ్ణ, ప్రకాష్‌చౌదరి, కృష్ణారెడ్డి, టీ.శేషారెడ్డి, వై.చంద్రమోహన్‌రెడ్డి, హనుమంతరావు, కురుబ లోకేష్‌గౌడ్, జయరాం తదితరులు పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ రాయదుర్గం సమన్వయకర్త మెట్టు, నాయకులు

రాయదుర్గంటౌన్: కోటలో వెలసిన స్వయంభూ జంబుకేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం అశ్వవాహనాన్ని కోట వీధి, వినాయక సర్కిల్ మీదుగా లక్ష్మీబజార్ సర్కిల్ వరకు ఊరేగించారు. అంతకుముందు స్వామి పార్వేటోత్సవం జరిగింది. సోమవారం వసంతోత్సవం జరుగుతుంది.



కణేకల్లులో చిక్కణ్ణేశ్వర రథోత్సవంలో పాల్గొన్న అశేష జనవాహిని



నందికోళ్లతో భక్తుల కోలాహలం

వైద్యశిబిరానికి విశేష స్పందన



మాట్లాడుతున్న గౌని ఉపేంద్రారెడ్డి

రాయదుర్గం: మండలంలోని వేపరాళ్లలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, నియోజకవర్గం ఐటీ వింగ్ అధ్యక్షుడు బోర్‌వెల్ ఆనందరెడ్డి సౌజన్యంతో కర్నూలు శ్రీచక్ర హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. గుండె జబ్బులు, కంటి శుక్లాలు, ఏకో, ఈసీజీ, షుగర్, బీపీ, జనరల్ చెకప్‌లు సుమారు వెయ్యి మందికి పైగా చేశారు. వివిధ జబ్బుల బారిన పడినవారు 190 మంది ఉన్నట్టు వైద్యులు నిర్ధారించారు. వారందరినీ ప్రత్యేక వాహనంలో కర్నూలు శ్రీచక్ర ఆస్పత్రికి తరలించారు. నాయకులు మాట్లాడుతూ పేదలకు సేవ చేయాలనే దృక్పథంతో వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు.

కబరస్తాన్ అభివృద్ధి కమిటీ ఏర్పాటు



కబరస్తాన్ అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గం

కణేకల్లు: కణేకల్లు పట్టణ కబరస్తాన్ (శ్మశాన వాటిక) అభివృద్ధి కమిటీని ఆదివారం ముస్లింలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రామనగర్‌లోని ఈద్గా మసీద్‌లో ముస్లింల సమావేశం జరిగింది. సమావేశంలో ఏకాభిప్రాయంతో ముస్లింలు కమిటీని ఎన్నుకున్నారు. కబరస్తాన్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా హనుమాపురం బషీర్ అహమ్మద్, ఉపాధ్యక్షుడిగా యు.బాషా, కార్యదర్శిగా జక్రీయ, సహాయ కార్యదర్శులుగా గౌస్‌పీర్, షాకీర్, కోశాధికారిగా పెద్దదేవర నబీషా, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా తపాల్ అయూబ్, ఫరూక్, దాదాపీర్, అన్వర్‌బాషా, జమీల్ అహమ్మద్, మహాబూబ్‌పీరాతోపాటు మరో 24 మంది సభ్యులను ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారులుగా షేక్ మహమ్మద్‌గౌస్, హాజీ మహబూబ్‌సాబ్, పెద్దదేవర హమీద్, చిన్న ఫకృద్దీన్, ఎంసీ వన్నూరుసాబ్, హుస్సేన్‌సాబ్‌ను ఎన్నుకున్నారు.

దళిత వాడల్లో మౌలిక వసతులు కల్పించాలి

- సామాజిక చైతన్యయాత్రలో కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప



ఉరవకొండలోని దళిత వాడల్లో జీపుయాత్రలో ప్రసంగిస్తున్న కేవీపీఎస్ నాయకులు

ఉరవకొండ: రాష్ట్ర ప్రభుత్వం దళిత, గిరిజన వాడల్లో మౌలిక వసతులు కల్పించడానికి చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప, ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిద్దూ, ఉపాధ్యక్షులు తరిమెల గిరి, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు రంగారెడ్డి డిమాండ్ చేశారు. మహాతత్మా జ్యోతిబా పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఎస్ఎఫ్ఐ, ఐద్వా, కేవీపీఎస్ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రారంభమైన జీపుయాత్ర ఆదివారం ఉరవకొండకు చేరుకుంది. నాయకులు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు నేటికీ సొంత ఇల్లు, కనీసం ఎకరం పొలం కూడా లేదన్నారు. దళిత వాడల్లో తాగడానికి నీళ్లు, మురుగుకాలువలు, రోడ్లు కూడా సరిగాలేవన్నారు. దళిత, గిరిజన బాలికలు, మహిళలలు దాడులు, అత్యాచారాలు పెరిగిపోయాయన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు చంద్రిక, రామాంజనమ్మ, అశ్విని, శ్యామల, జీవరత్నం , రాజా, అక్కులప్ప, నాగేంద్ర పాల్గొన్నారు.